పుంత రోడ్లు అస్తవ్యస్తం

- ఏడాదికి సెస్ రూపంలో రూ.కోటి వసూలు
- వ్యవసాయదారులకు సౌకర్యాల కల్పనపై నిర్లక్ష్యం
- చినుకుపడితే పుంతరోడ్లు బురదమయం
- వ్యవసాయ ఉత్పత్తుల తరలింపునకు అగచాట్లు
- ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తుతున్న రైతులు


నల్లాకులవారిపాలెం వద్ద ధ్వంసమైన పుంత రోడ్డు


అన్నవరప్పాడులో ఆక్రమణకు గురైన శక్తమ్మ పుంత రోడ్డు

పెరవలి: రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే పుంత రోడ్లు ఎక్కడికక్కడ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వ్యవసాయదారులు పండించిన పంటల నుంచి లక్షల రూపంలో సెస్‌ల రూపంలో వసూలు చేస్తున్న ప్రభుత్వం సాగుదారులకు అవసరమైన కనీస రవాణా సౌకర్యాలు కనిపించడంలో ప్రేక్షక పాత్ర వహించడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. పంట భూములకు వెళ్లే పుంతరోడ్లను నిర్మించకపోవడంతో వర్షాకాలంలో రైతులు పడే పాట్లు వర్ణనాతీతం. ఇటీవల కురిసిన వర్షాలకు పుంత రోడ్లు పూర్తిగా పాడైపోవడంతో రైతులు పొలాల నుంచి ధాన్యం తెచ్చుకోవటానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాబోయే వర్షాకాలంలో పొలాలకు వెళ్లేందుకు మరిన్ని పాట్లు పడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల పుంత రోడ్లను రైతులే స్వచ్ఛందంగా అభివృద్ధి చేసుకున్నా వాహనాలు రాకపోకలు, వర్షాల వలన గోతులు ఏర్పడి ఛిద్రమయ్యాయి. నడవడానికి కూడా ఇబ్బందిగా మారింది. కూరగాయలు, పండ్లు వంటి పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు నానా అగచాట్లు పడుతున్నామని వ్యవసాయదారులు అంటున్నారు. గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ సమావేశాల్లో రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్వహించిన రైతు సదస్సుల్లో ప్రతి గ్రామం నుంచి పుంతరోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేయడంతో పాటు సభలను కూడా గతంలో బహిష్కరించారు. మార్కెట్ యార్డులు సెస్‌లు వసూలు చేయటానికే తప్ప రైతుల ప్రయోజనానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. సౌకర్యాలు కల్పించలేనప్పుడు సొమ్ములు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు.

పుంతల పరిస్థితి

పెరవలి మండలంలో 162 పుంతరోడ్లు ఉండగా ఇందులో ప్రధానంగా 18 ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులను కలిపే పుంత రోడ్లు ఉన్నాయి. ఈ పుంతరోడ్ల ద్వారానే నిత్యం వ్యవసాయోత్పత్తులను మార్కెట్‌కు తరలిస్తారు. వీటిలో ప్రభుత్వం నుంచి ఒక్క పుంతకు కూడా రోడ్డు వేయలేదు.

సెస్‌లు ఎంత చెల్లిస్తున్నారు

పెరవలి మండలం నుంచి గతంలో పెనుగొండ మార్కెట్ యార్డుకు ఏడాదికి రూ.80 లక్షలు, నిడదవోలు, తణుకు మార్కెట్టు యార్డులకు ఒక్కొక్కదాని నుంచి రూ.10 లక్షల వరకు సెస్‌ల రూపంలో ఆదాయం వస్తోంది. జిల్లాల పునర్విభజన వలన పెరవలి మండలాన్ని నిడదవోలు మార్కెట్ యార్డుకు మార్చటంతో కోటి రూపాయల ఆదాయం పెరిగింది. సెస్‌ల ద్వారా వసూలు చేసిన సొమ్ము నుంచి ఒక్క రూపాయి కూడా పుంతరోడ్ల అభివృద్ధికి కేటాయించలేదని రైతులు ధ్వజమెత్తుతున్నారు. ఇప్పటికైనా రైతుల ఇబ్బందులను పట్టించుకుని పుంత రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.


కాపవరంలో అధ్వానంగా పుంత రోడ్డు

అధికారులు పట్టించుకోవడం లేదు



రైతులు పండించిన పంటల నుంచి సెస్సులు రూపేణా అధికారులు సొమ్ము వసూలు చేస్తున్నారే తప్ప రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే పుంత రోడ్లు వేయటం లేదు. ఎన్నిసార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథులే కరువయ్యారు.

– మెట్టే సత్యనారాయణ, రైతు, ఖండవల్లి

రైతులకు మేలు చేయాలి



రైతుల సౌఖ్యం చూడలేనప్పుడు వారి నుంచి సెస్సు రూపంలో సొమ్ములు వసూలు చేయటం తగదు. కనీస సౌకర్యాలు కల్పించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వ ఆలోచన ఇప్పటికైనా మార్చుకుని రైతులకు మేలు చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

–వేంద్ర ఏసు, రైతు, ముక్కామల

పుంత రోడ్ల అభివృద్ధిపై నిర్లక్ష్యం



ఏటా లక్షలాది రూపాయలు రైతుల నుంచి సెస్సు వసూలు చేస్తున్నారు. రైతులు నిత్యం తిరిగే పుంత రోడ్లను అభివృద్ధి చేయడానికి నిధులు మాత్రం మంజూరు చేయటం లేదు. రోడ్లు వేయలేనప్పుడు ఎందుకు సెస్సు వసూలు చేస్తున్నారో అర్థం కావడం లేదు.

–పెనుమత్స వెంకటగోపాలకృష్ణంరాజు, రైతు, ఖండవల్లి

గోగులమ్మను దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నేతలు


అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నేతలు వేణు, తానేటి వనిత, గూడూరి శ్రీనివాస్

దేవరపల్లి: నల్లజర్ల మండలం పోతవరం గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ హోం మంత్రి తానేటి వనిత, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి ముప్పిడి వెంకటరత్నం, నాయకులు తోట రామకృష్ణ, పెండ్యాల వీర రాఘవులు, కానూరి ప్రసాద్, సింహాద్రి లక్ష్మణరావు, సింహాద్రి బాపిరాజు, పాపా నాగు, చిడిపి చింతయ్య తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శించుకున్నారు.

పతాకస్థాయికి కూటమి అరాచకాలు

- పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా ?
- సాక్షి కార్యాలయాలపై దాడి దారుణం
- రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవు
- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



చాగల్లు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచకాలు పతాకస్థాయికి చేరాయని, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు ఆవేదన చెందారు. నిజాలు రాసే కలాలను, వాస్తవాలు చెప్పే గళాలను నిరంకుశంగా అణగదొక్కుతున్నారన్నారు. చాగల్లులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరో చేసిన వ్యాఖ్యలను సాకుగా చూపించి కూటమి ప్రభుత్వం సాక్షి పత్రిక, చానల్‌పై టీడీపీ గూండాలను ఉసిగొలిపిందన్నారు. తెలుగువారి మనస్సాక్షిగా, పేదవాడి గొంతుకై నాణేనికి రెండోవైపు ప్రజల పక్షాన నిలబడుతూ, వాస్తవాలను ప్రచురిస్తూ.. ప్రసారం చేస్తున్న 'సాక్షి'పై రాజకీయ కుట్రలకు బరి తెగిస్తోంది. ఇందులో భాగంగా టీడీపీ ప్రోద్బలంతో కూటమి నేతలు, అల్లరిమూకలు కలిసి మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై మూకుమ్మడి దాడులకు తెగబడుతున్నారన్నారు.

మీడియాపై కూటమి దౌర్జన్యం తగదు

అమరావతిపై ఇటీవల సాక్షి టీవీ చానల్లో జరిగిన చర్చలో దొర్లిన కొన్ని వ్యాఖ్యలపై నిరసనల పేరుతో కూటమి నేతలు దౌర్జన్యాలకు దిగడం దారుణమని, మీడియా కార్యాలయాలను ధ్వంసం చేయడం సరైన విధానం కాదని తలారి ఖండించారు. మీడియాపై దాడి అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వ తప్పిదాలను 'సాక్షి' ప్రశ్నిస్తుందనే అక్కసుతోనే దాడులకు తెగబడుతున్నారన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. సాక్షి డిబేట్లో విశ్లేషకుడిగా వ్యవహరించిన 70 ఏళ్ల వయసున్న కొమ్మినేనిని అరెస్ట్ చేయడం, పచ్చ గుండాలతో సాక్షి కార్యాలయాలపై దాడులు చేయించడం రెడ్ బుక్ రాజ్యాంగానికి పరాకాష్ట అన్నారు. పథకం ప్రకారమే అక్రమ అరెస్ట్ చేశారని ఆరోపించారు. సాక్షి మీడియా అంతమే కూటమి పంతంగా కుట్రలకు పాల్పడుతోందన్నారు. మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నా రక్షణ చర్యలు లేవన్నారు. మాజీ మహిళా మంత్రి విడదల రజినీపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడి చేయి చేసుకున్నప్పుడు, వైఎస్సార్ జిల్లాలో మూడేళ్ల బాలికపై అత్యాచారం హత్య చేసినప్పుడు, అనంతపురం జిల్లాలో దళిత బాలికపై అత్యాచార ఘటనలు కూటమి ప్రభుత్వానికి కనిపించలేదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నేతలు, మహిళా నేతలపై సోషల్ మీడియాల్లో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నా వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఏడాది పాలన వైఫల్యాలను ఎండగడుతుండటం వల్లే కూటమి ప్రభుత్వం సాక్షిపై దాడులకు పాల్పడుతోందన్నారు. ఇప్పటికైనా కక్ష సాధింపులు మాని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు


మలకపల్లిలో రైతులకు పవర్ టిల్లర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు

తాళ్లపూడి: రైతులు ప్రభుత్వం అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని మలకపల్లిలో మంగళవారం మలకపల్లి పీహెచ్‌సీ వద్ద రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండలంలోని రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలను అందజేసారు. రూ.12,99,505 సబ్సిడీతో 8 పవర్ టిల్లర్లు, 8 రోటోవేటర్లు, 4 కల్టివేటర్లు, పవర్ స్ప్రేయర్, పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్ రూ.7,84,000 సబ్సిడీతో అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు, సర్పంచ్ రాపాక రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఎంపీడీవో టీబీ వెంకటరమణ, ఏవో జి.రుచిత, పీహెచ్‌సీ వైద్యాధికారి అన్నపూర్ణ, ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, నాయకులు నామన పరమేశ్వరరావు, కొఠారు వెంకట్రావు, మద్దిపాటి ప్రకాశం, రామారావు, కైగాల శ్రీనివాసరావు, గంటా కృష్ణ, రేఖపల్లి ముత్యాలరావు పాల్గొన్నారు.

రూ.10 లక్షల బంగారం రికవరీ


కేసు వివరాలు తెలియజేస్తున్న పోలీసు అధికారులు

తాళ్లపూడి (కొవ్వూరు): కొంత కాలంగా పలు చోరీలకు పాల్పడిన ఇద్దరు ముద్దాయిల నుంచి రూ.10 లక్షల విలువైన 125 గ్రాముల బంగారం రికవరీ చేసినట్లు కొవ్వూరు రూరల్ సీఐ కె.విజయబాబు తెలిపారు. కొవ్వూరు పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం ఆయన ఈ వివరాలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొవ్వూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న దొంగతనాలపై జిల్లా ఎస్పీ, కొవ్వూరు డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ విజయ్ బాబు, ఎస్సై కె.శ్రీహరిరావు, కొవ్వూరు క్రైం ఎస్సై పి.రవీంద్రబాబు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు కొవ్వూరు - ఏలూరు రోడ్డులో ఐ.పంగిడిలో రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో పోలీసులను గమనించి దేవరపల్లి వైపు నుంచి కొవ్వూరు వైపు ఓ కారును డ్రైవర్ వేగంగా నడిపే ప్రయత్నం చేశాడు. పోలీసులు ఆ కారును ఆపి అందులోని ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో, దొంగతనాల గుట్టు రట్టయ్యింది. నెల్లూరు జిల్లా బోగోలు మండలం యాదవపాలేనికి చెందిన మారుబోయిన మాల్యాద్రి, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం రాయలం పంచాయతీకి చెందిన తోటకూర రామకృష్ణంరాజుతో పాటు నరసాపురం మండలం లక్ష్మణేశ్వరానికి చెందిన సద్దుల కుమారరాజా కలిసి కారులో తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుల్లో మాల్యాద్రి, రామకృష్ణంరాజులను పోలీసులు అరెస్టు చేశారు. మూడో ముద్దాయి కుమార రాజా పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి కొవ్వూరు మండలం మద్దూరు, పెనకనమెట్టలో జరిగిన చోరీలకు సంబంధించి 125 గ్రాముల బంగారం రికవరీ చేశారు. ఈ కేసు విచారణలో ప్రతిభ చూపిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

అనన్యకు మంత్రి దుర్గేష్ అభినందన


చిన్నారి అనన్యను అభినందిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు : ప్రపంచ రికార్డు సాధించిన చిన్నారి అనన్యను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో చిన్నారితో కలసి ఆమె తల్లిదండ్రులు మంత్రిని కలిసారు. అతి చిన్న వయసులోనే ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తూ 18 నెలల వయసులో సూర్య నమస్కారంతో పాటు అనేక యోగాసనాలను ప్రదర్శించి, ప్రపంచ రికార్డుల పుస్తకంలో స్థానం పొందిన అనన్య పలువురు ప్రశంసలు అందుకుంటోంది. అనన్య మరిన్ని రికార్డులు సాధించాలని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు.

తరణి ఇండస్ట్రీలో అగ్నిప్రమాదం


తరణి ఇండస్ట్రీలో దగ్ధమవుతున్న సామగ్రి

తాళ్లపూడి: అన్నదేవరపేట రెవెన్యూ పరిధిలోని సూరయ్యపేట రోడ్డులో వైఎస్సార్ నగర్ కాలనీ సమీపంలో గల తరణి ఇండస్ట్రీలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రాత్రి 9 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఫ్యాక్టరీలోని విలువైన సామగ్రి, ప్లాస్టిక్ ట్యాంక్‌లు, కెమికల్ టిన్నులు తదితర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఈ ప్రమాదానికి కారణమని యాజమాన్యం చెబుతోంది. ఫ్యాక్టరీ గోడౌన్‌లో బేరియం క్లోరైడ్ స్టాక్ ఉంటుందని అగ్నిప్రమాదం వల్ల మంటలు మరింత ఎక్కువయ్యాయని తెలిపారు. ఆస్తి నష్టం తెలియాల్సి ఉంది. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలను అరికట్టాలి


కొవ్వూరులోని ప్రైవేట్ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయాలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా డిమాండ్ చేశారు. కొవ్వూరులోని రెండు ప్రైవేటు స్కూళ్లలో పుస్తకాల విక్రయాన్ని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్. రాజా మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల విక్రయాల విక్రయాలపై కొవ్వూరు ఎంఈవోకు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకుంటామని తెలియజేసారన్నారు. ఓ స్కూల్లో విక్రయానికి ఉంచిన పుస్తకాలు, బ్యాగ్‌లు తదితర సామగ్రిని ఒక రూమ్‌లో పెట్టి తాళం వేయించి ఎంఈవో–2కి అప్పగించామని తెలిపారు. మరో స్కూల్లో అమ్మకానికి సిద్ధం చేసిన పుస్తకాలు, ఇతర సామగ్రిని గుర్తించి అధికారులకు సమాచారం అందించామన్నారు. తక్షణమే జిల్లాలో ఉన్న అన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అధికారులు తనిఖీలు నిర్వహించాలని, విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జ్యోతి, జోసెఫ్, సాహితి, లహరి, నందిని, కనక, మౌళి, కార్తీక్, హేమంత్ పాల్గొన్నారు.

కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన అవసరం

ఉండ్రాజవరం: కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించడంలో తల్లితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యత వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, సరస్వతి అన్నారు. మండలంలో తాడిపర్రు, వెలగదుర్రు, ఉండ్రాజవరం, తదితర గ్రామాల్లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలు, తల్లిదండ్రులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వలన అనర్థాలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. కిశోర బాలికలకు ఆరోగ్య సూత్రాలతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిశోర వికాసం కమిటీ సభ్యులు, కార్యదర్శి పిల్లి మునలయ్య, వీఆర్వో చిట్టిబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాల అందజేత


యర్నగూడెంలో విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసిన పార్డ్ ఇండియా ప్రతినిధులు

దేవరపల్లి: పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దేవరపల్లి మండలం యర్నగూడెంలో వేసవిలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు మంగళవారం సంస్థ ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ అధ్యక్షుడు కారుమంచి గణేష్ మాట్లాడుతూ 2011 నుంచి సంస్థ విలేజ్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేసి ఏటా వేసవిలో విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ. అమ్మిరాజు, సచివాలయ కార్యదర్శి గారపాటి రవికుమార్, సంస్థ సభ్యులు సోమిశెట్టి వెంకట్రావు, దేవరాజు అచ్యుతరావు, ధూళిపూడి రవీంద్ర, హేమకుమార్, గుదే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దోమలతో వ్యాధుల ముప్పు


ఉండ్రాజవరంలో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

ఉండ్రాజవరం: దోమకాటుతో ప్రాణాంతక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ఉండ్రాజవరం అరుంధతి పేటలో మంగళవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ ఇళ్ల ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వారానికి ఒకసారి డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జున్నూరి శ్రీనివాసు, తణుకు ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, సెక్రటరీ సీ.పూజాశ్రీ, కె.మేరిమణి, విలేజ్ హెల్త్ సెక్రటరీ జి.భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్త టి.సునీత పాల్గొన్నారు.

శాప్ డైరెక్టర్‌గా పేరం రవీంద్రనాథ్



దేవరపల్లి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) డైరెక్టర్‌గా దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో 2017 నుంచి 2019 వరకు శాప్ డైరెక్టర్‌గా రవీంద్రనాథ్ పనిచేశారు. ప్రాజెక్టు విజయ్, సెంటర్ ఎక్సలెన్స్, సమ్మర్ రెసిడెన్షియల్ క్యాంపులు, మినీ స్టేడియం నిర్మాణం వంటి కార్యక్రమాలను రూపకల్పన చేశారు. 1983 నుంచి 2017 వరకు టి.నర్సాపురం, దేవరపల్లి జెడ్పీ హైస్కూళ్లలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. దాదాపు 12 ఏళ్లు దేవరపల్లి హైస్కూల్లో పీడీగా పనిచేసి యువతను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. 2017 నుంచి రామన్నపాలెం జెడ్పీ హైస్కూలు హెచ్ఎంగా పనిచేస్తున్నారు. రెండోసారి శాప్ డైరెక్టర్‌గా నియమితులైన రవీంద్రనాథ్‌ను పలువురు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

తాళ్లపూడి(కొవ్వూరు): ఎస్సీ కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. కొవ్వూరులోని ఎస్సీ కమిషన్ చైర్మన్ క్యాంప్ ఆఫీసులో మంగళవారం డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ మాట్లాడుతూ ముఖ్యంగా రోడ్డు సేఫ్టీ, రాబోయే వరదల దృష్ట్యా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, తాహసీల్దార్ దుర్గాప్రసాద్, కొవ్వూరు టౌన్ సీఐ పి విశ్వం, కొవ్వూరు రూరల్ సీఐ కె విజయబాబు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

దేవరపల్లి: గౌరీపట్నం వద్దనున్న నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్ జన్మదిన వేడుకలు మంగళవారం పుణ్యక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్, ఉషారాణి దంపతులు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పుణ్యక్షేత్రం మాజీ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ దిరిసిన ఆరోన్, పుణ్యక్షేత్రం తలనీలాల కాంట్రాక్టర్ క్లోనాగేశ్వరరావు వేడుకల్లో పాల్గొన్నారు. ఫాదర్ జాన్‌పీటర్‌ను ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. జాన్‌పీటర్‌తో కేక్ కట్ చేయించారు. ఏలూరు మేత్రాసన విచారణ గురువులు, నిర్మలగిరి పుణ్యక్షేత్రంలోని సేవకులు బట్టు శివ, కందుకూరి శ్యామ్, దుర్గారావు, అనిల్, మోషే తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పెరవలి: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని అటువంటి వివాహాలను ప్రోత్సహించకుండా, వాటిని అడ్డుకుని నిలుపుదల చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.సరోజినీ తెలిపారు. ఖండవల్లి సెక్టార్ పరిధిలోని ఖండవల్లి, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, పిట్టల వేమవరం గ్రామాల పరిధిలోని అంగన్‌వాడీ ఆయాలు, టీచర్లు కిషోర్ బాలికల సమావేశం మంగళవారం అన్నవరప్పాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతులకు 18 ఏళ్లు నిండిన తరువాత వివాహం చేయాలని తెలిపారు. యుక్త వయస్సు పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు గుడ్డుతో పాటు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ రాక

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురంలో బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత హాజరు కానున్నట్టు మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 80 శాతం సబ్సిడీపై రైతులకు డ్రోన్‌లు, వరి విత్తనాలు అందిస్తామని రాజారావు తెలిపారు.

సారా బట్టీలపై దాడులు

గోపాలపురం: సారా బట్టీలపై దాడులు నిర్వహించి వెయ్యి లీటర్ల బెల్లపు ఊట, అయిదు లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు ఎస్సై పి.మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరగపాడు గ్రామశివార్లలో సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. బట్టీ ఏర్పాటు చేసిన వ్యక్తులను గాలిస్తున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్ కె.దుర్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో యోగాంధ్ర

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు సానెపు వెంకటసుబ్బారావు యోగాసనాలు వేయించారు. ఆలయ ఈఓ, సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

నిడదవోలు : పట్టణంలోని ఒకటో వార్డు బాలాజీనగర్‌లో మున్సిపల్ స్థలంలోని బియ్యపుగుంట చెరువును పూడ్చివేసి రియల్ ఎస్టేట్ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. చెరువుకు సంబంధించి 40.68 సెంట్లు భూమి పూడ్చివేశారని తెలిపారు. చెరువు వద్ద మున్సిపల్ అధికారులు గతంలో ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లను కూడా అక్రమార్కులు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మేడవరపు భద్రం దొర, చిన్నం మురళీకృష్ణ పాల్గొన్నారు.